# ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రభంజనం

## ప్యాపిలి మండల టాపర్‌గా రాగనిత్య



**ప్యాపిలి, మే 2.( సీమ కిరణం న్యూస్) :** కార్పొరేట్ పాఠశాలలకే పరిమితం అనుకునే రికార్డులను తిరగరాస్తూ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభను చాటారు. మండలంలోని ఏనుగుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాలలో మండల స్థాయిలోనే కాక, డివిజన్ స్థాయిలోనూ సత్తా చాటి అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ ఫలితాలలో పాఠశాలకు చెందిన విద్యార్థిని రాగనిత్య 587 మార్కులు సాధించి మండలంలోనే ప్రథమ స్థానంలో నిలవడమే కాకుండా, డోన్ డివిజన్ స్థాయిలో మూడవ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఆమెతో పాటు అదే పాఠశాలకు చెందిన మనీషా 576 మార్కులతో ద్వితీయ స్థానాన్ని, గీతాలహరి 567 మార్కులతో తృతీయ స్థానాన్ని సాధించారు. అలాగే హర్షవర్ధన్ 558 మార్కులు సాధించి పాఠశాల గర్వించదగ్గ ఫలితాలను అందించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యు.ఎం. రాజశేఖర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేట్ సంస్థలకు ఏమాత్రం తీసిపోరని ఈ ఫలితాల ద్వారా నిరూపించారని హర్షం వ్యక్తం చేశారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆయన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామాంజనేయులు, మద్దిలేటి, సునీల్, ప్రతాప్ రెడ్డి, సాలయ్య, బి. మద్దిలేటితో పాటు ఎస్.ఎం.సి చైర్మన్ మహేంద్ర, గ్రామస్తులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థుల విజయాన్ని వేడుకగా జరుపుకున్నారు. తమ పిల్లలు సాధించిన ఈ విజయంతో తల్లిదండ్రులు ఆనందంలో మునిగిపోయారు.

# పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించిన ఉపాధ్యాయులు





**నెల్లూరు, ఆత్మకూరు, ఏఎస్ పేట, మే 2(సీమ కిరణం న్యూస్) :** ఏఎస్ పేట మండలంలోని కావలి ఎడవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు గ్రామస్తులు అభినందించారు ఈ సందర్భంగా ప్రథమ, ద్వితీయ మరియు తృతీయ స్థానాలను కైవసం చేసుకున్న విద్యార్థులను ఘనంగా సన్మానించి బహుమతులుగా 5000, 3000,2000 నగదు తో పాటుగా మెమెంటో అందజేశారు అలాగే విద్యార్థులందరికీ సర్టిఫికెట్ ఫైల్స్ ను పాఠశాల పూర్వ విద్యార్థి , ప్రస్తుతం అనంతసాగరం మండలం వెంగంపల్లి పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న నాగినేని మస్తానయ్య సొంత నిధులతో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షులు ఏలూరు మాల్యాద్రి నాయుడు , మన్యం మోహన్ రావు , ముప్పూరి సీతారామయ్య , పాల్గొన్నారు అలాగే హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు శైలజ, మరియు పాఠశాల సిబ్బంది పాల్గొని విద్యార్థులందరినీ అభినందించారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు

# నీట్ (యూజీ) పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

## కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్



**కర్నూలు క్రైమ్, మే 02, (సీమకిరణం న్యూస్):** ఈనెల 3న ఆదివారం మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు జరగనున్న నీట్ (యూజీ) పరీక్షల సందర్భంగా కర్నూలు పట్టణంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు పట్టణంలో మొత్తం 16 పరీక్షా కేంద్రాలలో 5,040 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షలు ప్రశాంతంగా, అవాంతరాలు లేకుండా జరిగేలా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఎస్పీ గారి ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు ప్రతి పరీక్షా కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులపై కఠిన నిఘా ఉంచడం జరుగుతుంది. పరీక్ష సమయాల్లో విద్యార్థులు సమయానికి ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని, ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో రావాలని సూచించారు. అలాగే, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండడంతో, అనవసరంగా గుమికూడకుండా ప్రజలు సహకరించాలని కోరారు.

# మండల టాపర్ భీమేష్ ను అభినందించిన యాజమాన్యం



**చిప్పగిరి, మే,02(సీమ కిరణం న్యూస్)** :పదవ తరగతి పరీక్షల్లో 589 మార్కులు సాధించి మండల టాపర్ గా నిలిచిన భీమేష్ను శనివారం ఫాతిమా స్కూల్ యాజమాన్యం ఇంటికి వెళ్లి అభినందించింది. ఈ సందర్భంగా ఫాతిమా స్కూల్ కరస్పాండెంట్ రోషమ్మ, హెచ్ఎం లూసి మాట్లాడుతూ, నిరుపేద కుటుంబంలో జన్మించి చదువులో ఉన్నత శిఖరాలు సాధించి పదిలో అధికమార్కులతో మండల టాపర్ గా నిలిచి ఫాతిమా స్కూల్ కు పేరు ప్రతిష్టలు తీసుకొచ్చిన భీమేష్ కుటుంబాన్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. ఇంకా మన ముందుకు ఎన్నో ఉత్తమ విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. స్కూల్ తోపాటు గ్రామానికి, పిల్లల తల్లిదండ్రులకు కూడా మంచి పేరును భీమేష్ తీసుకొచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా ప్రతి సంవత్సరం భీమేష్ మాదిరిగా ప్రతి ఒక్కరు అధికమార్కుల సాధించి మండల ఆఫర్లను జిల్లా టాపర్ లగాను రాష్ట్ర టాపర్లుగాను నిలవాలని

# పంచాయతీ సెక్రటరీపై చర్యలు తీసుకోవాలి

## వెల్దుర్తి మండల సర్వసభ్య సమావేశంలో వైఎస్సార్సీపీ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు

## సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత లోపాలు ఉన్నాయి

## పనుల కోసం లంచాలు డిమాండ్ చేస్తున్నారు

## వైఎస్సార్సీపీ ఎంపీటీసీ సభ్యుల ఆరోపణ





**వెల్దుర్తి, మే 02, (సీమకిరణం న్యూస్):** వెల్దుర్తి మండలంలోని అభివృద్ధి పనులు, అధికారుల పనితీరు, ప్రజాప్రతినిధుల సమస్యలపై వెల్దుర్తి మండల సర్వసభ్య సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. ప్రజాప్రతినిధులకు న్యాయం చేయాలంటూ పీఆర్ ఇన్చార్జ్ ఏఈఈ ఎం జాకీర్ హుస్సేన్, మేజర్ పంచాయతీ సెక్రటరీ కె లక్ష్మీనాథ్‌పై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్సీపీ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఎంపీడీఓ చంద్రశేఖర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎంపీపీ దేశాయ్ లక్ష్మీదేవమ్మ ఆధ్వర్యంలో, ఎంపీడీఓ చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఈ సమావేశం జరిగింది. మండల అభివృద్ధికి అధికారుల సమన్వయం అత్యంత కీలకమని ఎంపీపీ పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో అమలవుతున్న పథకాలను సమావేశంలో వివరించారు.

**ఆర్టీసీ బస్సుల సమస్యపై స్పందన**

పట్టణం గుండా వెళ్లే ఆర్టీసీ బస్సులు సమయానికి తిరగకపోవడం, మండల కార్యాలయం వద్ద ఆగకపోవడం వంటి సమస్యలను అధికారులు ప్రస్తావించారు. దీనిపై డిపో కంట్రోలర్ చంద్ర స్పందిస్తూ తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నాసిరకం పనులు, లంచాల ఆరోపణలు ఉన్నాయి : వైఎస్సార్సీపీ ఎంపీటీసీ సభ్యులు మండలంలో పీఆర్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత లోపాలు ఉన్నాయని, పనుల కోసం లంచాలు డిమాండ్ చేస్తున్నారని వైఎస్సార్సీపీ ఎంపీటీసీ సభ్యులు ఆరోపించారు. ఈ అంశాలపై విజిలెన్స్, క్యూసీ, ఏసీబీ అధికారులతో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, మండల సర్వసభ్య సమావేశంలో ఆమోదించిన పనులకు కూడా అంచనాలు వేయకుండా, ప్రతిపాదనలు పంపకుండా ఆలస్యం చేస్తున్నారని, తమ పదవీకాలం ముగిసే వరకు అంచనాలు వేయనని అధికారుల నుంచి సమాధానం రావడం బాధాకరమని సభ్యులు విమర్శించారు. ఈ వ్యవహారంలో రాజకీయ ప్రేరేపణ ఉందని కూడా ఆరోపించారు. ఫిర్యాదులపై స్పందన లేకపోవడం ఈ విషయమై ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన రాలేదని, సంబంధిత అధికారి సమావేశాలకు కూడా హాజరు కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఎంపీడీఓ చంద్రశేఖర్ రెడ్డి స్పందిస్తూ సమస్యను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తానని హామీ ఇచ్చారు.

**కుల వివక్ష ఆరోపణలు, నిధుల నిల్వ : వైఎస్సార్సీపీ ఎంపీటీసీ సభ్యులు**

వెల్దుర్తి మేజర్ పంచాయతీ సెక్రటరీ లక్ష్మీనాథ్‌పై కూడా తీవ్ర ఆరోపణలు వచ్చాయి. దళిత సర్పంచ్ ముత్యాల శైలజపై కుల వివక్ష చూపుతున్నారని, సుమారు రూ.3 కోట్ల (ఫిఫ్టీన్స్ ఫైనాన్స్, జనరల్ ఫండ్) నిధులు ఉన్నప్పటికీ ఇప్పటికే చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ అంశంపై వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు, ఎంపీటీసీ సభ్యుడు బొమ్మన రవిరెడ్డి సమావేశంలో అధికారులను నిలదీశారు. దీనిపై డిప్యూటీ ఎంపీడీఓ రవికిశోర్ స్పందిస్తూ విచారణ చేసి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

**ఇతర సమస్యల ప్రస్తావన**

మండలంలోని పలు సమస్యలను జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న సమావేశంలో లేవనెత్తి, వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే సమావేశాలకు గైర్హాజరు అవుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, వివిధ శాఖల అధికారులు, కోఆపరేటివ్ సభ్యుడు మాలిక్ బాష, మాజీ ఎంపీపీలు బొమ్మన సరళా రెడ్డి, కురువ రాజేశ్వరి, సొసైటీ చైర్మన్ రమాకాంత్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, సెక్రటరీలు పాల్గొన్నారు.

# ప్యాపిలిలో మహిళల భద్రత మా రక్షణే పై అవగాహన కార్యక్రమం







**ప్యాపిలి మే 02 (సీమ కిరణం న్యూస్) :** మహిళల రక్షణపై అవగాహన కల్పించేందుకు ప్యాపిలి టౌన్‌లోని వాసవి కళ్యాణ మండపంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. శనివారం తహసిల్దార్ భారతి, డోన్ టౌన్ ఇన్‌ఛార్జ్ సీఐ ఇంతియాజ్ భాష, ప్యాపిలి మండల తహసీల్దార్ భారతి, డోన్ రూరల్ ఎస్సై, శక్తి టీం ఇన్‌చార్జి మమత, ప్యాపిలి ఎస్సై నాగార్జున, ఏపీఎం కృష్ణ మూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవి కళ్యాణ మండపం మహిళా కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, సంఘ సభ్యులు, గ్రామ మహిళలు కలిపి సుమారు 200 మంది పాల్గొన్నారు. మహిళల భద్రతకు సంబంధించిన పలు అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిరోధం, ఫోక్సో చట్టం, ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు, సైబర్ నేరాలు వంటి విషయాలను వివరించారు. అదేవిధంగా ‘ క్రైమ్ ఎగైనెస్ట్ ఉమెన్’ వంటి శక్తి యాప్‌ల వినియోగంపై కూడా సమాచారం అందించారు. మహిళలు ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని, చట్టం వారి పక్షాన ఉందని పోలీసులు స్పష్టం చేశారు. కుటుంబాలలో బాలికల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మహిళలు అప్రమత్తంగా ఉండి, ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే పోలీసులను సంప్రదించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, మహిళలు, పోలీస్ సిబ్బంది మహిళా , పోలీసులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికులకు జీతాలు పెంచాలి

## బీజేపీ డిమాండ్



**పత్తికొండ మే 2 (సీమ కిరణం న్యూస్) :**పత్తికొండ మండలంలో గ్రామపంచాయతీ సిబ్బంది మరియు కార్మికుల సమస్యలపై భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శనివారం మండల అధ్యక్షుడు కరణం నరేష్ ఆధ్వర్యంలో డి ఎల్ డి వో శివశంకర్, గ్రామపంచాయతీ కార్యదర్శి, డిప్యూటీ ఎంపీడీవో నరసింహులు కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ కో-కన్వీనర్ గోవర్ధన్ నాయుడు మాట్లాడుతూ, గ్రామపంచాయతీ కార్మికులు చాలీచాలని జీతాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికిచ్చే జీతాలు వారు చేసే పనికి ఎంత మాత్రం సరిపోవడంలేదని వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారని కావున వారి జీతాలు పెంచాలని ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ జీతాలు, సమయానికి చెల్లింపులు లేకపోవడం, పెండింగ్ బకాయిలు వంటి సమస్యలు కార్మికులను ఆర్థికంగా కుదేలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రతి నెల నిర్దిష్ట తేదీలో జీతాలు చెల్లించే విధానం తీసుకురావాలని డిమాండ్ చేశారు. అలాగే ఈపీఎఫ్, ఈ ఎస్ ఐ వంటి సౌకర్యాలు కల్పించి కార్మికులకు భద్రత కల్పించాలని కోరారు. ఇకపోతే, సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, బీజేపీ అధికార ప్రతినిధి హోసూరు బ్రహ్మయ్య, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దండి మల్లికార్జున, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సీసీ రంగన్న, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి రాంపల్లి రంగయ్య, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు రవీంద్ర, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి మాలేఖరి వీరేష్, భగవాన్ రావు ఎస్టి మోర్చా మండల అధ్యక్షుడు హరీష్ నాయక్, అడ్వకేట్ లక్ష్మీనారాయణ, యువ మోర్చా నాయకులు బాబ్జి గౌడ్, మండల కార్యదర్శి నరసింహులు, కర్ణం చంద్ర కార్యకర్తలు మరియు గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# యజమాని ఇంట్లో దొంగతనం పనిమనిషి అరెస్ట్







## దొంగతనం కేసును ఛేదించిన 4వ పట్టణ పోలీసులు

## పని మనిషి నుండి 15 తులాల బంగారు ఆభరణాలు,

## 300 గ్రాముల వెండి వస్తువులు

## స్వాధీనం చేసుకున్న పోలీసులు

## ఎస్ఐ గోపినాథ్, ఎస్ఐ చంద్ర శేఖర్ లను

## అభినందించిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్

**కర్నూలు క్రైమ్, మే 02, (సీమకిరణం న్యూస్) :** కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని సూర్య దేవాలయం వద్ద గల వివేక్ నగర్లో నివాసం ఉంటున్న కృష్ణమూర్తి నాగేంద్ర అను అతని ఇంటిలో ఏప్రిల్ నెల 21వ తేదీ నుండి 27 వ తేదీ మధ్యలో వారి ఇంటిలోని సుమారు 15 తులాల బంగారు ఆభరణాలు మరియు 30 తులాల వెండి వస్తువులు కనిపించడం లేదని ఇంటికి తరుచుగా వచ్చే పనిమనిషి గాని లేదా కూరగాయలు తీసుకొచ్చి ఇచ్చే వ్యక్తి గాని వీటికి కారణం అయి ఉండొచ్చు అని అనుమానం వ్యక్తం చేస్తూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 4వ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ విక్రమ్ సింహ కేసు నమోదు పరిచి దర్యాప్తులో భాగంగా అనుమానితులైన ఇద్దరినీ విచారించి అందులో దొంగతనానికి పాల్పడినది వన్ టౌన్ ఏరియాలో నివాసం ఉంటు ఫిర్యాది ఇంట్లో గత 3 నెలలుగా ఇంటి పని చేస్తున్న పనిమనిషి పర్వీన్ గా గుర్తించి, శనివారం సదరు పనిమనిషిని వారి ఇంటి వద్దనే అరెస్టు చేసి, విచారించి, ఆమె ఇంటిలో దొంగలించి దాచుకున్న 15 తులాల బంగారు ఆభరణాలు మరియు 30 తులాల వెండి వస్తువులను స్వాధీనం చేసుకొన్నారు. ఇందులో చురుకుగా పని చేసి, రికవరీకి సహకరించిన ఎస్ ఐ గోపినాథ్, ఎస్ ఐ చంద్ర శేఖర్ మరియు పిసీ మురళి, హెచ్ సి జీనస్, పీసీ సుబ్బారాయడులను కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించారు.

**ప్రజలకు 4వ పట్టణ పోలీసుల విజ్ఞప్తి**

ఇళ్లలో పనిమనుషులు లేదా సహాయకులను నియమించుకునేటప్పుడు యజమానులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని 4వ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ విక్రమ్ సింహ ప్రజలను విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లలో పని మనుషులను పనిలో చేర్చుకునే ముందే సమీప పోలీస్ స్టేషన్ ద్వారా ‘పోలీస్ వెరిఫికేషన్’ చేయించుకోవాలని పనివారి పూర్తి చిరునామా, ఆధార్ కార్డు మరియు ఫోటోలను దగ్గర ఉంచుకోవాలన్నారు. విలువైన వస్తువులను బీరువాలో భద్రపరుచుకుని, తరచూ వాటిని తనిఖీ చేస్తూ ఉండాలన్నారు. ఈ కేసును ఎస్ ఐ గోపినాథ్, ఎస్ ఐ చంద్ర శేఖర్ మరియు పిసీ మురళి, హెచ్ సి జీనస్, పీసీ సుబ్బారాయడులు విజయవంతంగా ఛేదించారు.

## ఉద్యోగులకు కేంద్రం అదిరిపోయే న్యూస్.. డీఏ పెంపుపై కీలక ప్రకటన



కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్. కేంద్రం డీఏను 2 శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో 58 శాతం ఉండగా.. ఇప్పుడు 60 శాతానికి పెంచింది. ఈ మేరకు కేంద్ర ఆర్థికశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మోదీ సర్కార్ భారీ శుభవార్త అందించింది. కరువు భత్యం(డీఏ) రేట్లను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. జనవరి 1,2026వ తేదీ నుంచి కొత్త రేట్లు అమల్లోకి వచ్చేలా సవరణలు చేసింది. ఈ మేరకు ఏప్రిల్ 22వ తేదీన కేంద్ర ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. డీఏను బేసిక్ వేతనంలో 58 శాతం నుంచి 60 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించింది. అంటే 2 శాతం డీఏను పెంచుతున్నట్లు కేంద్రం ప్రకటించింది. దీంతో బేసిక్ శాలరీ రూ.50 వేలు పొందే ఉద్యోగికి రూ.వెయ్యి పెంపు లభిస్తుంది. రక్షణ సేవల నుంచి జీతాలు పొందే పౌర ఉద్యోగులకు కూడా ఈ పెంపు వర్తిస్తుంది. ఇక సాయుధ దళాలు, రైల్వే ఉద్యోగులకు సంబంధించి ప్రత్యేక ఉత్తర్వులు వెలువడతాయి. సాయుధ దళాల ఉద్యోగులకు సంబంధించి రక్షణ శాఖ ప్రత్యేక ఉత్తర్వులు ఇవ్వనుండగా.. రైల్వే ఉద్యోగులకు పెంపుకు సంబంధించి రైల్వేశాఖ నోటిఫికేషన్ ఇవ్వనుంది. కేంద్రం సాధారణంగా ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏను సంవత్సరానికి రెండుసార్లు పెంచుతుంది. జనవరి, జులైలో పెంచుతుంది. వీటికి సంబంధించిన ప్రకటనలు మార్చి, అక్టోబర్ నెలల్లో వస్తూ ఉంటాయి. సంవత్సరానికి రెండుసార్లు వీటిని సమీక్షించి పెంచుతూ ఉంటారు. ఈ డీఏ పెంపు వల్ల దాదాపు 50 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, 65 లక్షల మంది పెన్షనర్లు లబ్ది పొందనున్నారు.

## రైలులో జనరల్ బోగీలు ముందు, వెనుక ఎందుకుంటాయో తెల్సా..? పెద్ద కథే ఉందిగా..




రైలులో జనరల్ కోచ్‌లు ఎప్పుడూ ముందు లేదా వెనుక ఎందుకు ఉంటాయో తెలుసా? దీని వెనుక రద్దీ నియంత్రణ మాత్రమే కాదు, రైలు సమతుల్యత, సాంకేతిక భద్రతా కారణాలు కూడా ఉన్నాయి. అవేంటో మరి ఈ స్టోరీలో తెలుసుకుందామా.. ఓ సారి లుక్కేయండి ఇక్కడ. మనం రైలు ప్రయాణం చేసేటప్పుడు గమనిస్తే, జనరల్ బోగీలు ఎప్పుడూ రైలుకు అటు చివర లేదా ఇటు చివర ఇంజిన్ పక్కనే ఉంటాయి. రిజర్వేషన్ చేయించుకున్న స్లీపర్, ఏసీ కోచ్‌లు మాత్రం రైలు మధ్యలో ఉంటాయి. ఎప్పుడైనా ఎందుకు ఇలా అమర్చుతారని ఆలోచించారా? దీని వెనుక కేవలం ప్రయాణికుల సౌకర్యం మాత్రమే కాదు, చాలా లోతైన సాంకేతిక కారణాలు, భద్రతా అంశాలు కూడా దాగి ఉన్నాయి. జనరల్ బోగీల్లో ప్రయాణికుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుంది. ఒకవేళ వీటిని రైలు మధ్యలో పెడితే, స్టేషన్ వచ్చినప్పుడు ప్రయాణికులందరూ మధ్యలోనే గుమిగూడతారు. దీనివల్ల ప్లాట్‌ఫారమ్‌పై రద్దీ పెరిగి, ఇతర ప్రయాణికులు ఇబ్బంది పడతారు. బోగీలు చివర ఉండటం వల్ల రద్దీ ప్లాట్‌ఫారమ్ రెండు చివరలకు ఏర్పడటంతో, ప్రయాణం సాఫీగా సాగుతుంది. అలాగే ఎమర్జెన్సీ సమయంలో జనాన్ని ఖాళీ చేయడం కూడా సులభమవుతుంది. రైలు వేగంగా వెళ్లేటప్పుడు లేదా మలుపులు తిరిగేటప్పుడు గాలి ఒత్తిడి, కుదుపులు ఎక్కువగా ఉంటాయి. జనరల్ కోచ్‌లలో పరిమితికి మించి ప్రయాణికులు ఉంటారు కాబట్టి, వాటిని మధ్యలో ఉంచితే రైలు బ్యాలెన్స్ దెబ్బతినే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా, ఇంజిన్ అందించే విద్యుత్ సరఫరా లేదా బ్రేకింగ్ వ్యవస్థపై ఒత్తిడి పడకుండా ఉండటానికి ఈ అమరిక దోహదపడుతుంది. స్లీపర్ కోచ్‌లను మధ్యలో ఉంచడం వల్ల అక్కడ ప్రయాణికులకు కుదుపులు తక్కువగా ఉండి ప్రయాణం సౌకర్యవంతంగా అనిపిస్తుంది. రైల్వే శాఖ ప్రతి నిర్ణయం వెనుక ఇలాంటి ఎన్నో లెక్కలు ఉంటాయని నిపుణులు అంటున్నారు.

## కొత్తగా వ్యాపారం స్టార్ట్ చేసేవారికి గుడ్ న్యూస్.. కేంద్రం నుంచి రూ.3 లక్షల లోన్.. అప్లై చేసుకోండిలా..



కేంద్ర ప్రభుత్వం వ్యాపారులకు తక్కువ వడ్డీకే రుణ సౌకర్యం కల్పిస్తోంది. కేవలం 5 శాతం వడ్డీకే రుణం పొందవచ్చు. ఇందుకు ఎలాంటి పూచీకత్తు అవసరం లేదు. కొత్తగా వ్యాపారం స్టార్ట్ చేయాలనుకునేవారికి తోడ్పాటు అందించాలనే లక్ష్యంతో కేంద్రం రుణం అందిస్తోంది. వీటి వివరాలు చూస్తే.. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా కమ్మరి, క్షౌరవృత్తి, ముత్యాల తయారీ, వడ్రంగి, మట్టి పాత్రలు, తాళాలు తయారీ, తాపీ, పడవల తయారీ, శిల్పులు, చేపల వలల తయారీ, బొమ్మల తయారీ, మట్టి పాత్రల తయారీ వంటి చేతి వృత్తులు చేసే కళాకారులకు కేంద్రం రూ.3 లక్షల రుణం అందిస్తోంది. ఈ స్కీమ్‌లో మొత్తం 18 వ్యాపారాలను చేర్చింది. ఈ చేతివృత్తుల వ్యాపారం చేసేవారికి మాత్రమే విశ్వకర్మ యోజన ద్వారా కేంద్రం లోన్ అందిస్తోంది. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వ్యాపారాలు చేసేవారికి కూడా ఈ పథకం వర్తిస్తుంది. సాంప్రదాయ వృద్ధులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో కేంద్రం ఈ పథకం అమలు చేస్తోంది.

**ఎలాంటి పూచీకత్తు లేకుండా..**

వ్యాపారం, అర్హతను బట్టి రూ.3 లక్షల వరకు రుణం విశ్వకర్మ యోజన పథకం ద్వారా పొందవచ్చు. ఈ లోన్‌కు ఎలాంటి పూచీకత్తు అవసరం లేదు. ఎలాంటి హామీ లేకుండా ఈ రుణాన్ని అర్హులు పొందవచ్చు. ఈ లోన్ రెండు విడతలుగా అందిస్తారు. తొలి విడతలో వ్యాపారం స్టార్ట్ చేయడానికి రూ.లక్ష మంజూరు చేస్తారు. అనంతరం వ్యాపార విస్తరణ కోసం రూ.2 లక్షలు అందిస్తారు. అయితే ఈ రుణానికి వడ్డీ కేవలం 5 శాతం మాత్రమే ఉంటుంది. ఈ లోన్ పొందేందుకు ఎలాంటి ఆస్తులు తాకట్టు పెట్టాల్సిన అవసరం ఉండదు. అలాగే ఎలాంటి హామీ కూడా పెట్టాల్సిన అవసరం లేదు. గ్యారంటీ రహితంగా అందించే లోన్‌గా దీనిని చెప్పవచ్చు. చేతివృత్తుల్లో నైపుణ్యం ఉండి వ్యాపారం స్టార్ట్ చేయాలనుకునేవారికి ఈ రుణం మంజూరు చేస్తారు.

**ఈ డాక్యుమెంట్స్ అవసరం**

ఈ పథకం కింద లోన్ పొందాలంటే వయస్సు 18 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉండాలి. జూఎజఅంప్త్రఘ్ఝుఝ్ఠతీఝ్ఖ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. హోమ్ పేజీలో అప్లై ఆన్ లైన్‌పై క్లిక్ చేయండి. అనంతరం మీ వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోండి. అనంతరం రిజిస్ట్రేషన్ నెంబర్, పాస్ వర్డ్ మొబైల్‌కు వస్తాయి. ఆ తర్వాత వాటితో లాగిన్ అయ్యి దరఖాస్తు పూర్తి చేయండి. అనంతరం అవసరమైన డాక్యుమెంట్స్ అప్ లోడ్ చేయండి. ఇక ఆధార్ కార్డ్, పాన్ కార్డు, ఇన్ కమ్ సర్టిఫికేట్, క్యాస్ట్ సర్టిఫికేట్, రెసిడెన్షియల్ సర్టిఫికేట్, పాస్ పోర్ట్ సైజు ఫోటో, బ్యాంక్ పాస్ బుక్, మొబైల్ నెంబర్ కలిగి ఉండాలి. సెప్టెంబర్ 17,2023లో ఈ పథకం ప్రారంభించగా..

# దేశ ప్రజలకు షాకింగ్ న్యూస్.. వచ్చే నెలలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంపు..? ఎంతంటే..?




వచ్చే నెలలో పెట్రోల్, డీజల్ ధరల షాక్ తప్పదా.. ధరలు భారీగా పెరగనున్నాయా.. అంటే అవునని తెలుస్తోంది. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు వచ్చే నెలలో ముగియనున్నాయి. దీంతో ఆ తర్వాత ధరల పెంపు ఉండవచ్చునే అంచనాలు వెలువడుతున్నాయి. ఒకేసారి భారీగా ధరలు పెరిగే అవకాశముంది. త్వరలో వాహనదారులకు షాక్ తగలనుందా..? పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరగనున్నాయా..? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న విషయం తెలిసిందే. వచ్చే నెలలో ఎన్నికలు ముగియనున్నాయి. దీంతో ఎన్నికల ఫలితాల తర్వాత పెట్రోల్, డీజల్ ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచనుందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ముడి చమురు ధరలు పెరగడం వల్ల ఆయిల్ ఉత్పత్తి చేసేందుకు ఇంధన కంపెనీలకు ఖర్చు ఎక్కువవుతోంది. ముడి చమురు ధరలు పెరిగినా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచకపోవడం వల్ల కంపెనీలపై భారం పడుతోంది. దీంతో పెట్రోల్ ధరలను పెంచడం అనివార్యంగా తెలుస్తోంది.

**లీటర్‌పై ఎంత పెంచుతారంటే..?**

ప్రస్తుతం ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో కేంద్రం ధరల పెంపుపై వెనక్కి తగ్గింది. ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందనే ఉద్దేశంతో ధరలు పెంచలేదు. అయితే ఎన్నికల తర్వాత ఖచ్చితంగా పెంపు ఉంటుందని కొటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ అంచనా వేసింది. లీటర్‌పై ఏకంగా రూ.25 నుంచి రూ.28 వరకు పెరగవచ్చని తన రిపోర్టులో తెలిపింది. హార్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు, పశ్చిమాసియాలో టెన్షన్ వాతావరణం వంటి కారణాలతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరిగాయి. గత కొద్ది రోజుల్లోనే రికార్డ్ స్థాయిలో పెరిగాయి. దీంతో ఆయిలు కంపెనీలపై భారం పడుతుందని, నెలకు రూ.27 వేల కోట్ల భారం పడుతుందని వెల్లడించింది. ఇలాంటి పరిస్థితుల్లో ధరలను పెంచకపోతే కంపెనీలు నష్టపోయే అవకాశముంది. దీంతో భారాన్ని కస్టమర్లకు బదిలీ చేయాల్సిన అవసరం ఉంటుందని కొటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ స్పష్టం చేసింది.

**పవర్ పెట్రోల్ ధర పెంపు**

ఇప్పటికే కేంద్రం పవర్ పెట్రోల్ ధరలను పెంచింది. అలాగే వాణిజ్య డీజిల్ ధరలను పెంచింది. ఇక ఆయిల్ కంపెనీలకు నష్టం తగ్గించేందుకు పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని భారీగా తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. డీజిల్‌పై ఎక్సైజ్ ట్యాక్స్‌ను సున్నాకు తగ్గించింది. ఇది కొంతమేరకు కంపెనీలకు భారాన్ని తగ్గించినప్పటికీ.. హార్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలతో చమురు సరఫరా నిలిచిపోయింది. దీని వల్ల ఆయిల్ దిగుమతులకు ఆటంకం

# ఆధార్ కార్డు ఉన్నవారికి సూపర్ న్యూస్.. ప్రూఫ్ లేకపోయినా అడ్రస్ మార్చుకోవచ్చు.. ఎలా అంటే..?

ఆధార్ కార్డులో అడ్రస్ మార్చుకోవాలనుకుంటున్నారా..? అయితే మీ దగ్గర ఎలాంటి ప్రూఫ్ లేదా..? అయితే మీరు టెన్షన్ పడాల్సిన అవసరం లేదు. మీ దగ్గర ఎలాంటి ప్రూఫ్ లేకపోయినా సులువుగా ఆధార్ కార్డులో అడ్రస్ మార్చుకోవచ్చు. ఇందుకోసం యూఐడీఏఐ కొత్త ఆప్షన్ తీసుకొచ్చింది. దేశంలో నివసించే ప్రతీఒక్కరికీ అవసరమైన డాక్యుమెంట్ ఆధార్. ఇది లేనిది దేశంలో ఎలాంటి ప్రభుత్వ పథకాలు, సేవలు పొందలేము. ఇది ఒక తప్పనిసరిగా డాక్యుమెంట్‌గా మారిపోయింది. అందుకే ఆధార్ కార్డులోని వివరాలు అన్నీ కరెక్ట్‌గా ఉండేలా చూసుకోవాల్సిన అవసరముంది. మీరు ఇల్లు మారినప్పుడు అడ్రస్ అప్డేట్ చేసుకోవడం చాలా ముఖ్యం. దీని వల్ల మీకు అనేక ప్రయోజనాలు ఉంటాయి. అదే అడ్రస్ వేరేచోట ఉంటే మీరు పలు సేవలు పొందటంలో ఇబ్బందులు పడే అవకాశముంది. ఆధార్ కార్డులో అడ్రస్ అప్డేట్ చేసుకోవాలంటే అడ్రస్ ప్రూఫ్ అవసరమవుతుంది. రెసిడెన్షియల్ సర్టిఫికేట్ లేదా ధృవీకరణ కోసం ఇతర పత్రాలు అప్‌లోడ్ అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అయితే ప్రూఫ్ లేని సమయంలో ఆధార్ కార్డులో అడ్రస్‌ను అప్డేట్ చేసుకోవడం వినియోగదారులు కష్టతరంగా మారుతుంది. ఈ సమస్యను తొలగించేందుకు యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా(యూఐడీఏఐ) కొత్త రూల్స్ తీసుకొచ్చింది. ప్రూఫ్ లేకపోయినా ఈ కొత్త ఆప్షన్ ద్వారా మీరు సులువుగా ఆన్‌లైన్ విధానంలో అడ్రస్ అప్డేట్ చేసుకోవచ్చు. ఈ కొత్త ప్రాసెస్ ఏంటి అనేది చూద్దాం.




**అడ్రస్ ప్రూఫ్ అవసరం లేదు**

మీ కుటుంబ పెద్ద ఆధార్ వివరాల ఆధారంగా మీరు ఆధార్ అడ్రస్ మార్చుకోవచ్చు. అయితే ఇందుకు కుటుంబ పెద్ద ఆన్‌లైన్‌లో తన సమ్మతి తెలపాల్సి ఉంటుంది. ఈ విధానంలో మీరు ఎలాంటి అడ్రస్ ప్రూఫ్ అప్ లోడ్ చేయాల్సిన అవసరం ఉండదు. కేవలం మీ కుటుంబ పెద్ద మీకు అనుమతి ఇస్తే సరిపోతుంది. దీంతో వారి ఆధార్ కార్డులోని అడ్రస్ మీ కార్డులో కూడా అప్డేట్ అవుతుంది. అడ్రస్ అప్డేట్ కోసం ప్రూఫ్ సమర్పించలేక చాలామంది ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సులువుగా అప్డేట్ చేసుకునేందుకు యూఐడీఏఐ ఈ సదుపాయం తీసుకొచ్చింది.

**ఎలా అప్డేట్ చేసుకోవాలి..?**

యూఐడీఏఐ వెబ్‌సైట్లోకి లాగిన్ అవ్వండి
అడ్రస్ అప్డేట్ ఆప్షన్ ఎంచుకోండి
ఫ్యామిలీ హెడ్ బేస్డ్ అడ్రస్ అప్డేట్ ఎంచుకోండి
కుటుంబ పెద్ద ఆధార్ నెంబర్ ఎంటర్ చేయండి
కుటుంబపెద్దతో సంబంధాన్ని నిర్ధారించేందుకు రేషన్ కార్డు, పాస్ పోర్ట్, మార్క్ షీట్ లాంటి డాక్యుమెంట్స్ అందివచ్చు
కుటుంబపెద్దతో మీ సంబంధాన్ని తెలిపే పత్రం అప్ లోడ్ చేయండి

**రూ.50 ఫీజు చెల్లించండి**

ఆ తర్వాత సబ్మిట్ చేయండి
రిఫరెన్స్ నెంబర్ సేవ్ చేసుకోండి
రిఫరెన్స్ నెంబర్ ఆధారంగా మీరు స్టేటస్ చెక్ చేసుకోవచ్చు
30 రోజుల్లోపు మీ ఆధార్‌లో అడ్రస్ అప్డేట్ అవుతుంది.
30 రోజుల్లోగా అవ్వకపోతే మీ దరఖాస్తు ఆటోమేటిక్‌గా రిజెక్ట్ అవుతుంది.

# వై-ఫై వాడేవారికి బీఎస్ఎన్ఎల్ అదిరిపోయే ప్లాన్.. రూ.వెయ్యికే 3 నెలల పాటు హైస్పీడ్ ఇంటర్నెట్




బీఎస్ఎన్ఎల్ కస్టమర్లను ఆకట్టుకునేందుకు అనేక మొబైల్, వై-ఫై రీఛార్జ్ ప్లాన్లను ప్రవేశపెడుతోంది. అందులో భాగంగా మరో కొత్త వై-ఫై ప్లాన్ లాంచ్ చేసింది. తక్కువ ధరకే మూడు నెలల వ్యాలిడిటీతో కూడిన ప్లాన్ తీసుకొచ్చింది. ఈ ప్లాన్ తీసుకున్నవారికి హైస్పీడ్ ఇంటర్నెట్ లభించనుంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్(బీఎస్ఎన్ఎల్) అదిరిపోయే వై-ఫై రీఛార్జ్ ప్లాన్ అందుబాటులోకి తెచ్చింది. హోమ్ వైఫై ప్లాన్ పేరుతో తీసుకొచ్చిన ఈ రీఛార్జ్ ప్లాన్ అతి తక్కువ ధరకే లభిస్తోంది. అతి తక్కువ ధరకే మూడు నెలల పాటు వై-ఫై రీఛార్జ్ పొందవచ్చు. కస్టమర్లను ఆకట్టుకునేందుకు బీఎస్ఎన్ఎల్ ఈ బంపర్ ఆఫర్ ప్రకటించింది. తక్కువ రీఛార్జ్‌తో హైస్పీడ్ డేటా మీరు పొందవచ్చు. అసలు ఈ ప్లాన్ ధర ఎంత..? ఎంత జీబీ హైస్పీడ్ డేటా వస్తుంది? అనే వివరాలు తెలుసుకుందాం.

**కేవలం రూ.1099కే 3 నెలల పాటు వై-ఫై**

బీఎస్ఎన్ఎల్ హోమ్ వై-ఫై పేరుతో కొత్త రీఛార్జ్ వై-ఫై ప్లాన్ ప్రారంభించింది. ఈ ప్లాన్ వ్యాలిడిటీ మూడు నెలలు ఉంటుంది. దీని ధర కేవలం రూ.1099 మాత్రమే. ఈ మూడు నెలల పాపటు 1400 జీబీ హైస్పీడ్ డేటా పొందవచ్చు. 40 ఎంబీపీఎస్ స్పీడ్‌తో ఇంటర్నెట్ ఉపయోగించుకోవచ్చు. ఇక ఈ ప్లాన్‌లో అన్ లిమిటెడ్ కాల్స్ కూడా పొందవచ్చు. నగరాలు, పట్టణాలు మాత్రమే కాకుండా గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా ఇబ్బందులు లేకుండా ఇంటర్నెట్ సౌకర్యం పొందవచ్చని బీఎస్ఎన్ఎల్ తన ఎక్స్ అకౌంట్‌లో పేర్కొంది.

**రూ.1కే ఫ్రీడమ్ ప్లాన్**

ఇక ఇటీవల బీఎస్ఎన్ఎల్ రూ.1కే ఫ్రీడమ్ ప్లాన్ ప్రవేశపెట్టింది. కొత్త సిమ్ తీసుకునేవారి కోసం ఈ ప్లాన్ మళ్లీ తీసుకొచ్చింది. ఏప్రిల్ 30వ తేదీ వరకు మాత్రమే ఈ ప్లాన్ అందుబాటులో ఉంటుంది. కొత్తగా బీఎస్ఎన్ఎల్ సిమ్ తీసుకోవాలనుకునేవారికి ఈ ఆఫర్ వర్తిస్తుంది. బీఎస్ఎన్ఎల్ సర్వీస్ సెంటర్లు లేదా రిటైలర్ల ద్వారా ఈ ఆఫర్ పొందవ్చు. ఫ్రీడమ్ ప్లాన్ వివరాల్లోకి వెళ్తే.. రూ.1కే సిమ్ లభిస్తుంది. నెలల రోజుల పాటు అన్ లిమిటెడ్ కాల్స్, రోజు 2జీబీ డేటా పొందవచ్చు. ఇక రోజుకు 100 ఎస్ఎంఎస్‌ల సౌకర్యం ఉంటుంది.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2018/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com